వేలెట్టి చూపావా అంటే ఈ గడతో నీకళ్లు పొడిచేస్తాను" అంది. అలా ఆమె అంటూనేవుంది వివేకానందరావు గడచివరపై ఫోటో గ్రుచ్చాడు. "ఏమిటా అది?" అని విద్యార్థిని గడలాక్కు చూచుకొంది కదా తన వినోదవేషం!

ఎప్పుడూ మాట్టాడంది "ఇంకా ఇలాంటివి ఎన్ని కాపీలున్నాయి?" అని కేకేసింది విద్యార్థిని. "ఎన్నైనా వున్నాయి! నేనొక్కత్తెను కనబడుతూ వున్నానా?" అని అరిచించి గదిలో పడుచు.

వివేకానందరావుకి తనగది కిటికీ తీసివుంచాలో వెంటనే మూసి వెయ్యాలో బోధపడలేదు.

... ... ... ... ...

## జొంపిపల్లి కిసిమిసి

పడకప్పటి కలల్లాగు నడకప్పటి దృశ్యాలొక్కొక్కప్పుడు మనల్ని విడువకుండా వెంటాడిస్తూ వుంటాయి. కలలకంటె మనోహరంగా కూడా వుంటాయి కొన్నికొన్ని నిజమైన కళకాంతులు-మరిపించే మార్గాల మలుపుల్లోనివైతేం ఆ మలుపుల్లో దసులయ్యే మనుష్యుల వైతేం! అలా దసులయ్యే మనుష్యులందు కనవచ్చే మగువల వైతేం!

ఆమె నుదురు నలుపు, కనురెప్ప లంతకన్నా నలుపు, చెవులు నలుపు, చెక్కిళ్ళు నలుపు, ముక్కు నలుపు తక్కింది సరాసరిచుబుకం నలుపు-పోనీ వాతెర దొండపండా అని గమనించితిమా-అదీ నలుపే. అయితేం ఆ హఠాల్లబ్ధ ముహూర్తమందు పైని వివరించిన సమస్తాన్నీ పచ్చిగులాబీ పువ్వురంగువచ్చి మీద పడి ఆవహించి అచ్చంగా ఆవాసనే ఆవన్నె అన్నంత ఉపోద్ఘాత తరంగమై ఆమెచూపునువెల్లి విరియజేసింది చూపులో జేవురింపు మినహా.

ఓరెప్పనలా దించింది, ఆమెదించిన రెప్పమ్మటే నీలాచల రావుయొక్క కనురెప్పకూడా ఆదాగా ఎగుచూపుచూచింది, దిగు చూపు సమానపు టోరనేసారించింది. ఆమె కుడివంక పయట వొత్తిగిల్లివుంది. వొత్తిగిల్లినవాయ నుబ్బెత్తు తెల్లని మస్లిన్‌జాకెట్టు సౌభాగం, సన్నజాజిపూరేకు లతికించి కుట్టిన ఫక్కీగా, ఉత్ఫుల్ల పుండరీకదళం బోర్లించినమాదిరిగా కనవచ్చింది. లోతట్టు 'బాడీ' అనటిడిప్పయొక్క లోపలి గళ్ళపారవతుగా హత్తుకు అమరి వుండడం కూడా పరిశోధనాఫలితమో నాప్రచురమైంది. ఇన్నింటి మీదా ఓమేలిమి 'చైను' అన్తూ తూల్తూ తొల్లింటి మెరుగుదెబ్బల కసితీర్చుకుంటూవుంది.

నీలాచలరావు ఏతచ్ఛోభ గమనిస్తూనే-" ఎదరెదరచూపు దిగువంకకు విదిరించింది-ఏమో ? నేనావైపు చూచానోలేదో అనే! పలకరించనా? మాననా ? " అని యిలా మెయిల్ ట్రెయిన్ వేగంలో తపాల్‌గాడీ "హర్టు" రంగు సవ్వడిమల్లే స్వగతం గావించుకు, పట్టలేక ఎట్టకేలకు "మీది మావూరుకాదూ ? " అన్నాడు. ఆమె "అవునండీ! మీరెలాకనిపెట్టారూ ? గావకం వున్నానే ? మాకు కిస్‌మస్ సెలవులిచ్చారు. మావోళ్ళంతా పడవల రేవులో వున్నారు. నేనిప్పుడు మనవూరెడున్నాను. Thank you sir గాపకంపట్టారు, నిండా సంతోషం " అంది.

నీలాచలరావుకు ఇంగ్లీషురాదు. సిసలైన రైతుబిడ్డ. ఏమూల వున్నా ప్రకృతిలోని, మనిషిలోని శృంగారాన్ని గ్రహించగలడేగాని గ్రహించిన శృంగారాన్ని మాటల్లో పాదివిపొందికగా ఎదరవాళ్ళ కందియ్యగల నాగరీక శిక్షణగలవాడుకాడు. అంచేత ఆమె నోటంట "థ్యాంక్సుసర్-నిండా సంతోషం" ఈలాంటి పద జాలం వెలువడ్డంతోనే తలపుమార్చుకొని "నేనూ స్టీమరుమీద బయలుదేరి యీపొద్దే వచ్చేస్తున్నాను. ఎంతమంది మీసజ్జు ? " అని అడిగాడు కూలికూతల సంఖ్యనుగురించి వాకబుచేసినట్టు

"ఏంటుండి అలా అడుగుతారు!" అని ఆమె నుతాతక్షణం ఓకూలి కూతురైనట్టు ఇట్టే జవాబు చెప్పింది.

అప్పటికి వారిద్దరూ లోలో చిరునవ్వులు ఆత్మలయొక్క గిలిగిలింతల్లా అనుభవానికి తెచ్చుకుంటూ విడిపోయారు. ఆ సంఘటన వారిరువురూ మరో నిమిషానికే మరచిపోయారు కూడాను. ఏలా అంటారేమో పాఠకులు! ముందంజలో నీలాచల రావుకో రిక్షా ఎదురైంది. ఆ రిక్షాలో ఇద్దరు ఏంగ్లో ఇండియన్ పడుచులు కూర్చుని మోకాళ్ల వలంపుకు ఓ తెరచిన చిన్నగొడుగు చారల్ది గుబ్బవాటంగా అడ్డంపెట్టుకుని ప్రజలకు ముఖాలు కాపరుస్తూ ఇద్దరూ చెరోజామిపండూ గుప్పిళ్ళకు సరిపడే పరిమాణానివి, రంగుపూసికొన్న పెదవులమధ్య పెట్టుకు కొరుక్కు తింటూ, జునపాలు గాలికెగర్నించుకుంటూ వున్నారు. నీలాచల రావు వాళ్లనుచూస్తూ ఆ జామిపళ్ళు "అనకాపల్లివా! హాల్మకానివా ?" అనే సమస్యనుపడి సమస్తం మరచిపోయాడు. ఆమె ఆ కిస్మస్ సెలవుపిల్ల, ముందంజెను అక్కడే తేగలు కొనుక్కొని కొనుక్కున్న మూడు తేగల్లోను వోతేగ చీల్చుకుంటూ మరో కిస్మస్ పిల్లను కలుసుకొని దానికొకటిచ్చి "తంపటిది తిను ఎంతబావుందో!" అని అంటూ సమస్తం మరచిపోయింది.

ఆ సమయమప్పుడు వెన్నెలా ఎండా అని అడక్కండి. ఆకాశంమీద చంద్రుడూ వున్నాడు, సూర్యుడూ వున్నాడు. వెన్నెలా ఎండా కలోసుకు కాస్తూవున్నారా అన్నట్టు వెచ్చగానూవుంది కాంతి, చల్లగానూవుంది కాంతి. తప్పక టైమ్‌చెప్పవలసివస్తే బహుళపక్షం ధనుర్మాసం పగలు పదకొండుగంటలు, మరి ఆ సమశీతోష్ణమ, సమశీతోష్ణమ పదిరోజులవరకు ఆవేళకు సరిగా ఆనందాన్ని కలిపిస్తూనేవుంది. పొలాలబయళ్ళ ఇళ్ళపెరళ్ల మనుష్యులు దిసదిస వీపులు మూపులు కనిపించేలా ఎండలోకూర్చుని కబుర్లు చెప్పుకోవడంలో గడియారపుగంటలు వినిపించడమే మానేశాయి.

మన "కిస్మస్" సెలవులపిల్ల పేరు కుశలమ్మ. ఆ పది రోజుల సెలవుల్లోను ఓరోజున తన యీడువాళ్లతో తనగూడెంలో మాట్లాడుతూ అంది "మనవూరు నీలాచలరావుగారికి "కిస్మస్" యీవి పరిపడం అంటే ఏమిటో తెలియదనుకుంటాను. ఇలా తట్టలో జాంపళ్లు పంపారేమిటే నాకు—కార్డులేకుండా కనకం లేకుండా గ్రీటింగులేకుండా మీటింగులేకుండా?" అంది. విన్న చెలికత్తె వెంటనే అంది–"అయన కసలు 'లవ్' అంటే ఏమిటో ఒకటి తెలుసునా ఏమిటి? కిస్మిస్ ఈవిదాకా పోతావు! నిన్నూ పలకరించడమే, నన్నూ పలకరించడమే. నిమ్నజాతుల నీరసమ్మును పలకరించడమే?"

కుశలమ్మ ఆమాటకొంచెం సంకోచించి పళ్ళతట్టతెచ్చిన పాలికాపుతో "కాపుగారూ! ఈ పళ్ళన్నీ నాకేనా మా అందరికీనా?" అని అడిగింది. పాలికాపు "మీ అందరికీ అనే పంపించారు నీలాచలరావు బహద్దర్ దొరగారు. మీరంతా మునుపూ ముందూ అరిపాలా లూడ్చేవారంటగా!" అన్నాడు. కుశాలమ్మ "ఊడ్చే వారంటగా ఏంటి? కాపూ! నువ్వెరగవు మమ్మల్నందర్నీని? మరసిపోయావు?" అంది అదోమాదిరిగా పాలికాపువంకచూస్తూ. పాలేరన్న "మరచిపోలేదు, మరచిపోలేదు" అంటూ కుశలమ్మ కేసి వెనుచూపులు చూస్తూ వెళ్ళిపోయాడు.

కుశలమ్మ తనలో "మా అందరిదీ మూకుమ్మడిప్రేమే— ఓ యేసూ! నీవొక్కనిదే ముఖ్యమైన ఏకైకప్రేమ-ఓ యేసూ!"అని అనుకుంటూ నీలాచలరావుగారు పంపించిన జామిపళ్లల్లోని ఒక పండు తాను ముందుగా తీసికొంది. అమె తీసుకోవడం అనుచ రిస్తూ తోడివారున్నూ ఆగంపలోంచి తలోపండూ తీసికొన్నారు. "నేటిది జాంపళ్ళ కిసిమిసి, నీలాచలరావుగారి జామిపళ్ళ కిసిమిసి" అంటూ.

... ... ... ... ...